157) మాళవగౌళ

ప|| ఏమీ నెఱుగనినాడు యిటు నిన్ను గొలిచేనా | నీమాయ దెలుపగా నిను ననేగాకా ||

చ|| పసురముగ జేసితే బడి నిన్ను దలచేనా | వెస రాయిజేసితే వెదకి నిన్నెఱిగేనా |
పొసగ మానుగ నన్ను బుట్టించితే బొగడేనా | ముసిపి నరుజేయగా మొరయిడేగాక ||

చ|| మొగి మృగము జేసితే మొక్కనెఱిగేనా | తగ బక్షి జేసితే దరి బూజ సేసేనా |
జిగి నితరజంతువుగ జేసితే దగిలేనా | అగపడి వివేకి జేయగ ననేగాక ||

చ|| యింత కధికారి జేసి యీప్రపంచజ్ఞాన- | మింత యొసగితివి మర గికనేలా |
చింత లిన్నియు దీర శ్రీవేంకటేశ నను | సంతతము నేలగా శరణనేగాక ||